## సొంత లాభం

### ఎంత మానుకు...?

"సార్! ఈ జాగా ఎవరిది?" అదరా బాదరాగా వచ్చిన ఆ ఆసామి నన్నడిగాడు, నా సీటు పక్క కనబడుతున్న అర్ధంగుళం ఖాళీ నేపు చూపుతూ.

సమాధానం కోసం ఒక్క క్షణమైనా ఆగితే ఒట్టు!

అవతలి మనిషిని నమ్మా ఆ అవలింతల మనిషి మీదికి నెట్టేసి మరీ ఒరుసుకు పోయాడు.

ఈ కూర్చున్న సొంపుకి మళ్లీ పిచ్చాపాటి ప్రశ్న లొకటే... వేధించడానికి!

బయల్దేరిన బండి ఈ స్టేషన్ దాటి మరో స్టేషన్‌కు చేరుకుంది. ఇంతసేపూ ముద్ద ముద్దై కూర్చోడం వల్ల ఎక్కడి కీళ్లు అక్కడ పట్టేశాయి. అంచేత ప్లాట్ ఫారం మీద ఈ శరీరాన్ని కాస్త విదిలించుకుందామని బండి



దిగబోతూ, 'చూస్తూండ'మని నా సీటును అతనికి అప్పజెప్పి పోయాను.

నేను చేసిన పొరపాటు ఇదే!

తిరిగి వచ్చి చూసేప్పటికి నా సీట్లో ఇంకో వ్యక్తి మరో వ్యక్తి...- అతని స్నేహితులట వీళ్లు!

"పర్లేదుసార్, సర్దుకుందాం రండి" అన్నాడతను నన్ను చూసి. తృప్తి పడమా మరి!

"ఈ మాట అనాల్సింది మీరా? నేనా?" అన్నా న్నేను.

వాంఛించిన మౌనం మండి తృటిలోనే తేరుకుని, "నేనే" అన్నాడు స్థిరంగా.

"ఎంచేత?" అడిగాను విస్తుపోతూ.

"మీ సీటును ఆక్రమించి కూర్చున్నాం గదా అంచేత!"

ఈ వివరణ విని అవాక్కైనాను.

కదలిన బండి పొగ నుంచి ఇంత బొగ్గు వచ్చి నా ముఖానికి రుద్దుకొని నా జేబులోకి రాలింది.

—రమణమూర్తి బల్లెడ

## దొంగలు



'ఎ ధవ కోడి ఎంత పని జేసింది' అంటూ యథావిధిగా ఏడవసారి గొణిగాడు రంగయ్య. ఇంతకాలం గోడ గడియారంలా టంచన్‌గా తెల్లవారు ఝామున లేపేది. ఇవ్వాళ దీనికే మొచ్చింది? అర్థాంతరంగా కూసింది! తుమ్మల తోపు వచ్చేసరికి తెల్లవారు తుందనుకుంటే తెల్ల వారటమటుంచి చీకటి యింకా దట్టమై తుమ్మల తోపులా తనముందు నిలబడింది.

ఆలోచించుకుంటూ అనుమానంగా అడుగులు వేస్తున్న తాతకు చప్పుడు వినిపించి వెనక్కు తిరిగి చూచాడు.

మామూలు పంచె, అరచేతుల చొక్కా, జుట్టు ముడి, పై కండువాతో మసగ మసగ్గా కనపడ్డ మనిషిని చూసి రంగయ్య తాతకు భయం వెయ్యకపోగా ఉన్న భయం పోయి సంతోషంగా శ్వాస పీల్చుకున్నాడు. 'మనిషి తోడు దొరికింది, పరవాలేదు,' అనుకున్నాడు.

"ఏ ఊరు తాతా ఇంత రాత్తిరేల బయలుదేరావు" అన్నాడా వ్యక్తి. ఇంత సేపు మనసు లోనే సుళ్ళు తిరుగుతున్న కోడి మీద కోపం ఒక్కసారి భళ్ళున బైటపడింది. "ఏమీ చెప్పేదిలే నాయినా. కోడిని నమ్ము కొని యేట్లోకి దిగినా. అర్ధరేతికి కూసి నా దుంప దెంచింది" అన్నాడు తాత. "మీ దేవూరు ? ఎక్కడి కెళ్ళాలి? నీవుతోడూడావు కనక సరిపోయింది కాని లేకుంటే నాగతేంకాను?" అంటూ నిశ్వసించాడు. ఆ నిశ్వాసంలో ఎంత విశ్వాసం! "నేను తోడు లేక పోతే మాత్రం నిన్ను ఏం చేస్తారు. తాత? నీ దగ్గరేముందని అన్నాడావ్యక్తి.

రంగయ్య తాత చిన్నగా నవ్వి, మంద్రస్థాయిలో "నన్నేమి చేసినా ఫరవాలేదు నాయనా! నా కూతురి బ్రతుకు భంగమై పోతుందనే నా బాధ. దాని జీవితం గాలిలో దీపంలా ఉంది. ఎట్టాగో ఆయేడు కొండల వాడి దయవలన వాడి మనసు మారి, కట్నం లేకపోతే మానె గుడ్డలు పెట్టి పంపించు, తీసికెళ్తానంటూ జాబు రాశాడు. ముసలోళ్ళం కూలి నాలీ చేసి రెక్కా విరుసుకున్న మొత్తం మూడు వందలుంటే గుడ్డలు తెద్దామని పట్నం బయలు దేరాను. దీని పాడుగాను ఈ కోడి..."

ఆ వ్యక్తి గట్టిగా నవ్వాడు! "కోడిదేందిలే తాత. నువరాత బాగుండాలి గాని" అన్నాడు.

రాత అనగానే తాతకు వేదాంతం గుర్తుకు వచ్చి "ఏందోలే నాయనా, ఏదో ఒక రోజు ఈ ఆకు రాలి పోయేదే కదా! అయితే ఉన్న నాలుగు రోజులు ఈ ఊగులాట తప్పదనుకో" అంటూ ఎదురుగా చూసి తాత నిర్ఘాంత పోయాడు. నల్లగా తుమ్మ మొద్దులాంటి నలుగురు మనుషులు. చేతిలో దుడ్డు కర్రలు! "ఏందిరా ముసలోడా! ఏదైనా తెస్తున్నవా? ఊరికే ఊగులాడు కుంటూ వస్తున్నవా" అంటూ కర్ర అడ్డం పెట్టారు.

వేదాంతం ఇగిరిపోయి ఒళ్ళంతా చెమట పట్టింది తాతకు నోరు పెగలడం లేదు. పక్క నున్న మనిషి వైపు చూశాడు నీ వేదిక్కన్నట్లు! "తాత దగ్గర ఉండేది మూడొందలేరా" అన్నాడు నవ్వుతూ 'ఈడు కూడా వాడేనా!' తాత గుండె ఒక్కసారి ఆగిపోయినట్లు యింది. శరీరం వణుకుతూంది. కన్న కూతురి మొఖం కళ్ళ ముందు కనపడి కనుకొలకుల్లో నీళ్ల నిలిచాయి.

"ఏంది ముసలోడా, వణికితే వదలి పెడ్తా మను కున్నావా? ముందా మూడొందలు ఆడపెట్టు" అన్నా డొకడు కర్కశంగా.

వెంట వచ్చిన మనిషి తాత ముఖం లోకి చూస్తూ మనలాం టి దొంగపాము కాదురా తాతది. ముస లోళ్ళు చెమటోడ్చి సంపాయించింది. అందులో అది

